అర్హులందరికీ 'జగనన్న సురక్ష'

- సులభంగా.. ఉచితంగా ధ్రువపత్రాల అందజేత
- వైఎస్సార్‌సీపీ 'తూర్పు' సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల
- 13వ వార్డులో 843 మందికి పంపిణీ



లబ్ధిదారుకు క్యాస్ట్ సర్టిఫికెట్ అందజేస్తున్న సమన్వయకర్త విజయనిర్మల, జెడ్సీ కనకమహాలక్ష్మి, కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన వారందరికీ ఉచిత సేవలు, సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ కాలనీ ఆఖరి బస్‌స్టాప్ వద్ద బుధవారం జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి, కార్పొరేటర్ కెల్ల సునీతతో కలిసి ఆమె లబ్ధిదారులకు కుల, ఆదాయ తదితర ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాలు వార్డుల్లో ఏర్పాటు చేసి కుల, ఆదాయ, వివాహ, బర్త్, డెత్ తదితర సర్టిఫికెట్లు అధికారులు అందజేస్తున్నారన్నారు. వీటి కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, డబ్బులు ఖర్చు లేకుండా సులభంగా మూడు, నాలుగు రోజుల్లో అందిస్తున్నారని చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల ద్వారా ప్రజలను దోచుకున్నారని, నెలలు తరబడి తిప్పుతూ వారి వద్ద డబ్బులు వసూలు చేసేవారని ఆరోపించారు. ఇప్పుడు అధికారులు నేరుగా కాలనీలకు వచ్చి ఎటువంటి ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అవసరమైన సర్టిఫికెట్లు కోసం దరఖాస్తులు చేయించారన్నారు.

సేవలు వినియోగించుకోండి

13వ వార్డు పరిధిలోని 9 సచివాలయాల్లో 1,933 మంది సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకోగా.. ప్రస్తుతం 843 మందికి మంజూరయ్యాయని విజయనిర్మల చెప్పారు. మిగిలిన వారికి ఒకటి, రెండు రోజుల్లో మంజూరవుతాయన్నారు. ఇంకా అవసరమైనవారు ఈ నెల 23 వరకు ధ్రువపత్రాల కోసం సంబంధిత సచివాలయాలకు వెళ్లి దరఖాస్తులు చేసుకోవచ్చని, జగనన్న సురక్ష సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వార్డు ప్రత్యేక అధికారి ప్రసాద్, ఏపీడీ గంగాధర్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, దుర్గారావు, పి.శ్రీనివాస్, వెంకటరెడ్డి, శిరీషా, బాబూరావు, అప్పలనాయడు, పోలరావు, బేగం పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లోనే క్యాస్ట్ సర్టిఫికెట్



నాకు క్యాస్ట్ సర్టిఫికెట్ అవసరమైంది. కార్పొరేటర్ కెల్ల సునీత ఆఫీస్‌కు వెళ్లి కుల ధ్రువపత్రం కోసం ఎక్కడికి వెళ్లాలని అడిగాను. వలంటీర్ మీ ఇంటికి వచ్చి దరఖాస్తు చేయిస్తారని ఆమె చెప్పారు. ఆ ప్రకారమే మా ఇంటికి వలంటీర్ వచ్చి నాతో దరఖాస్తు చేయించారు. నాలుగో రోజుల్లోనే జగనన్న సురక్ష ద్వారా క్యాస్ట్ సర్టిఫికెట్ నాకు అందించారు. చాలా సంతోషంగా ఉంది.

– ఎం.రమణ, ఆరిలోవ కాలనీ

ఖర్చు లేకుండా సర్టిఫికెట్ ఇచ్చారు



మా పిల్లలకు క్యాస్ట్ సర్టిఫికెట్ అవసరమైంది. దీని కోసం సచివాలయంలో సంప్రదించాను. అక్కడ సిబ్బంది జగనన్న సురక్షలో దరఖాస్తు చేయాలని చెప్పారు. రెండు రోజుల కిందట వలంటీర్ మా ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించారు. బుధవారం ఉచితంగా సర్టిఫికెట్ అందజేశారు. మంచి కార్యక్రమం చేపట్టిన ముఖ్యమంత్రి జగన్‌కు మా కృతజ్ఞతలు.

– నల్లని శ్రీదేవి, పైనాపిల్ కాలనీ

ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించారు



వారం రోజుల కిందట వలంటీర్ మా ఇంటికి వచ్చి మీకు ఏమైనా సర్టిఫికెట్లు అవసరముందా అని అడిగారు. మా పిల్లలను స్కూల్‌లో చేర్పించడానికి క్యాస్ట్ సర్టిఫికెట్ కావాలన్నారు. వెంటనే వలంటీర్ నాతో దరఖాస్తు చేయించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో కుల ధ్రువపత్రం అందించారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులకు ధన్యవాదాలు.

– ఎ.దాసు, ఆరిలోవ కాలనీ

ఏయూలో మేకపాటి ధ్యాన, జ్ఞాన క్షేత్రం

- ప్రారంభమైన నిర్మాణ పనులు
- రూ.2 కోట్లు అందిస్తున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో మేకపాటి గౌతం రెడ్డి అంతర్జాతీయ ధ్యాన, జ్ఞాన క్షేత్రం నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో ఈ క్షేత్రం నిర్మాణానికి సంబంధించి హనీ గ్రూప్‌తో మహాబోధి సొసైటీ అవగాహన ఒప్పందం చేసుకుంది. మహాబోధి సొసైటీ ప్రతినిధి ఆర్.విజయ్‌కుమార్, హనీ గ్రూప్ మేనేజింగ్ పార్ట్‌నర్ ఎం.ఓబుల్ రెడ్డి ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, మానవ అధ్యయన శాస్త్ర విభాగం ఆచార్యుడు పి.డి సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భవన నిర్మాణం, ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. ఇందు కోసం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి రూ.2 కోట్లను అందిస్తున్నారు. ఈ సందర్భంగా మహాబోధి సొసైటీ ప్రతినిధి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఏయూ అందిస్తున్న సహకారం, మేకపాటి రాజమోహన్‌రెడ్డి సౌజన్యంతో విశాఖ ప్రజలకు ఉపయుక్తంగా మేకపాటి గౌతంరెడ్డి అంతర్జాతీయ ధ్యాన, జ్ఞాన క్షేత్రం నిర్మిస్తున్నట్లు చెప్పారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత, సమాజంలో శాంతిని పెంచే విధంగా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు.

సమయపాలన ముఖ్యం

- ఆరోగ్య సిబ్బందితో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు
- ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధులపై సమీక్ష

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సమావేశ మందిరంలో బుధవారం గ్రామీణ ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకులు, సబ్ యూనిట్ అధికారులతో మలేరియా, డెంగ్యూ ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధులపై డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, కుటుంబ నియంత్రణ పాటించాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి, డాక్టర్ సలహాలు పొందేలా చూడాలని సూచించారు. నోడల్ అధికారి డాక్టర్ రమారెడ్డి మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం అన్ని క్లినిక్స్‌లోనూ షెడ్యూల్ ప్రకారం జరగాలన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసీ మాట్లాడుతూ ఫీవర్ సర్వేలో మలేరియా, డెంగ్యూ కేసులను గుర్తించి వెంటనే తెలియచేయాలన్నారు. జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ జగదీశ్వర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఎపిడిమిక్స్ రాకుండా చూసుకోవాలని, సీజనల్ వ్యాధులు రావడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వేలు చేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమీక్షలో ప్రోగ్రాం అధికారులు, ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు

- ఒకటో తేదీనే పెన్షన్ అందించిన ఘనత జగనన్నదే
- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల
- 17వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఎంవీపీకాలనీ: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా గడప గడపకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిదేనని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 17వ వార్డు ఆదర్శనగర్‌లో కార్పొరేటర్ గేదెల లావణ్యతో కలసి బుధవారం ఆమె పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, స్థానికుల సమస్యలు తెలుసుకుంటూ, ప్రజలతో మమేకం అవుతూ ముందుకు సాగారు. గడప గడపకు హారతులు, పూలమాలలతో ప్రజలు ఆమెకు స్వాగతం పలికారు. విజయనిర్మల మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒకటో తేదీనే లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న ముఖ్యమంత్రి అందరి మన్ననలు అందుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వాలు పింఛన్ల కోసం వృద్ధులను కార్యాలయాల చుట్టూ తిప్పుకొంటే, సీఎం జగన్ మాత్రం వారి ఇళ్లకు వలంటీర్లను పంపించి మరీ పింఛన్లు అందజేస్తున్నారన్నారు. అవ్వతాతలకు పెన్షన్ అందించే విషయంలో ముఖ్యమంత్రి జగన్ దేశంలోనే ఆదర్శంగా నిలిచారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని, పరిష్కారం దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా ధ్రువపత్రాలు పొందిన వారు అర్హతకు అనుగుణంగా ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు, నీలారెడ్డి, పిల్లా సత్యవతి, పలువురు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెక్యూరిటీ రూమ్ ప్రారంభం



రూమ్ ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థినుల వసతి గృహం విద్య తరంగిణి వద్ద నూతన సెక్యూరిటీ రూమ్‌ను బుధవారం ఉదయం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ప్రారంభించారు. హాస్టల్ విద్యార్థినులకు మరింత భద్రత కల్పించేలా దీనిని ఏర్పాటు చేశారు. వర్షా కాలంలో సెక్యూరిటీ సిబ్బందికి సైతం ఉపయుక్తంగా నిలిచేలా గదిని తీర్చిదిద్దారు. కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ వినుత, సీఎస్‌వో మహ్మద్ ఖాన్, యూనివర్సిటీ ఇంజినీరింగ్ రమణ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ చినగదిలి మండల కమిటీ ఎన్నిక



కమిటీ అధ్యక్షుడు విశ్వనాథం

ఆరిలోవ: ప్రోగ్రెసివ్ రికాగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్‌టీయూ) చినగదిలి మండల శాఖ ఎన్నికలు బుధవారం జరిగాయి. పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తోటగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో తొమ్మిది మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా తోటగరువు ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.విశ్వనాథం, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ గోవింద్‌తోపాటు మరో 7 మంది సభ్యులు ఎన్నుకున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు గజలక్ష్మి, సాయికృష్ణ, శివ, రాంబాబు, సత్యనారాయణ నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

బాబా ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ మల్లేశ్వరరావు

సీతమ్మధార: స్థానిక చైతన్యనగర్‌లోని వినాయక, షిర్డీసాయిబాబా ఆలయంలో సప్తాయన ఆలయ సంఘం ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని బుధవారం ఎంవీపీ పోలీస్ స్టేషన్ సీఐ మల్లేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వద్ద నేరాలు, దొంగతనాలను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో సప్తాయన సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

లలితా పీఠానికి వెండి ఊయల బహూకరణ



వెండి ఊయలను ఆవిష్కరిస్తున్న సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో కొలువైన లలితాదేవి అమ్మవారి ఊంజల్ సేవకు భక్తులు వెండి ఊయలను కానుకగా సమర్పించారు. కొంత మంది భక్తులు కలిసి సుమారు మూడున్నర కిలోల వెండితో తయారు చేసిన వెండి ఊయలను లలితా పీఠానికి బహూకరించారు. బుధవారం ఉదయం కుర్తాళం శంకరాచార్య, లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి చేతుల మీదుగా వెండి ఊయలను ఆవిష్కరించారు. కుర్తాళం పీఠపురోహితుడు మాచర్ల రమేష్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి రోజూ రాత్రి 8.45 గంటలకు అమ్మవారికి ఏకాంత సేవ జరుగుతుందని, ఇక నుంచి వెండి ఊయలలో ఈ సేవ నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

కార్పొరేషన్ల డైరెక్టర్లతో సమీక్ష



వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లతో అక్కరమాని విజయనిర్మల

ఎంవీపీకాలనీ: వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లతో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల బుధవారం ఎంవీపీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆమెతోపాటు పార్టీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణరాజు డైరెక్టర్లకు వివిధ అంశాలపై మార్గనిర్దేశం చేశారు. ఆయా కార్పొరేషన్ల పరిధిలోని నాయకులకు, సామాజిక వర్గాల ప్రజలకు ప్రభుత్వ పనితీరు, ప్రజారంజక పాలనపైనా అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకు అనుగుణంగా పెద్ద ఎత్తున వారిని సమీకరించి సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో చేస్తున్న కృషి పార్టీ శ్రేణులకు వివరించాలని కోరారు. త్వరలోనే ఈ ప్రక్రియను ప్రారంభించాలని డైరెక్టర్లలకు విజయనిర్మల, సూర్యనారాయణరాజు సూచించారు.

గుడ్ల విజయసాయికి అభినందన



గుడ్ల విజయసాయిని అభినందిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, పార్టీ నాయకులు

మద్దిలపాలెం: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో 23వ వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి కమిటీ సభ్యురాలిగా గెలుపొందారు. ఈ సందర్భంగా బుధవారం ఆమెను మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఆమె భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాసరావు అభినందించారు. పార్టీ 23వ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి, వార్డు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయసాయికి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సీపీ సన్నాహాలు



మద్దిలపాలెం జంక్షన్‌లో పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

మద్దిలపాలెం: నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా క్రమబద్ధీకరణకు పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా నగరంలోని పెద్ద జంక్షన్ మద్దిలపాలెంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సంబంధించి బుధవారం ఆయన పరిశీలించారు. ఇటు శ్రీకాకుళం, విజయనగరం, మధురవాడ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళ్లే మార్గంలో బీఆర్‌టీఎస్ రోడ్డును, గురుద్వారా వైపు వెళ్లే జాతీయ రహదారిని.. అటు త్రీటౌన్ వైపు వయా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మీదుగా గల రోడ్డును పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. ఎటువంటి ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ఉండేందుకు వీలుగా అన్ని చర్యలు చేపట్టాలని డీసీపీలు, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు ఆయన సూచనలిచ్చారు. ఈ మార్గంలో వన్‌వే ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు.

వ్యక్తి అదృశ్యం



చలపతిరావు(ఫైల్)

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కమిడిశెట్టి చలపతిరావు అనే వ్యక్తి జాలరిపేటలో నివసిస్తున్నాడు. చినవాల్తేర్‌లోని సాయిబాబా ఆలయ సమీపంలో పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ఇటీవల మెడికల్ చెకప్ చేయించుకుంటానని భార్య వరలక్ష్మికి చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన చలపతిరావు తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఫలితం లభించ లేదు. దీంతో చలపతిరావు భార్య ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు సమాచారం అందించాలని ఎంవీపీ పోలీసులు కోరారు.

డెంగ్యూ, మలేరియా కట్టడికి ప్రత్యేక కార్యాచరణ

జిల్లా మలేరియా అధికారి తులసి



అర్బన్ హెల్త్ సెంటర్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంవో తులసి

మద్దిలపాలెం: డెంగ్యూ, మలేరియా జ్వరాల కట్టడికి సచివాలయాల వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తున్నామని జిల్లా మలేరియా అధికారి తులసి తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఫీవర్‌సర్వే చేపట్టి వైద్య పరీక్షలు, వైద్యం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇసుకతోట, మధురవాడ, పీఎం పాలెం అర్బన్ హెల్త్ సెంటర్లను బుధవారం ఆమె సందర్శించారు. ఆయా హెల్త్ సెంటర్లలో డెంగ్యూ, మలేరియా నిర్ధారణకు చేస్తున్న పరీక్షలను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఫీవర్ సర్వేలో వలంటీర్లు గుర్తించిన జ్వరపీడితులకు సచివాలయ ఏఎన్‌ఎంలు తక్షణ వైద్యపరీక్షలు చేసి, తగిన వైద్యం అందించాలని సూచించారు. వారు క్షేత్రస్థాయిలో పరీక్షలు చేస్తున్న విధానాన్ని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు పరిశీలించాలన్నారు. డెంగ్యూ ,మలేరియా కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనల్లో దోమల లార్వాను గుర్తించి, తొలగించాలన్నారు. డెంగ్యూ, మలేరియా జ్వరాలపై అవగాహన కల్పించి, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ రామినాయుడు పాల్గొన్నారు.

27న పురందేశ్వరి రాక

ఎంవీపీకాలనీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఈ నెల 27న విశాఖ వస్తున్నట్లు ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాతరాజ్ తెలిపారు. అధ్యక్షురాలిగా పురందేశ్వరి బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి విశాఖకు వస్తుండటంతో.. ఆమెకు స్వాగతం పలికేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పదాధికారులతో సమావేశం నిర్వహించారు. పార్టీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య సమక్షంలో స్వాగత ఏర్పాట్లపై చర్చించారు.

ఏయూతో ఎంవీఆర్ డిగ్రీ కళాశాల ఎంవోయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో గాజువాకకు చెందిన ఎం.వి.ఆర్ డిగ్రీ కళాశాల అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఎంవీఆర్ డిగ్రీ కాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు బుధవారం సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందంలో భాగంగా డిప్లొమా ఇన్ యోగా, పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సులను నిర్వహిస్తారు. వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి కోర్సులను ప్రారంభించాలని సూచించారు. ఏయూ పరిధిలోని యోగా కోర్సులను ప్రవేశపెట్టనున్న కళాశాలల్లో ఎంవీఆర్ డిగ్రీ కళాశాల మొదటిదని కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, యోగా విభాగాధిపతి ఆచార్య కె.రమేష్ బాబు, ఎంవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు ఇళ్లివ్వాలి



తహసీల్దార్ రమణయ్యకు వినతిపత్రం అందిస్తున్న కొమ్మాది, బక్కన్నపాలెం రైతులు

ఆరిలోవ: మధురవాడ ప్రాంతం కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం గ్రామాల్లో భూములు కోల్పోయిన దళిత, పేద రైతులకు తక్షణమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రెవెన్యూ అధికారులను సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ కోరారు. ఆయా గ్రామాల రైతులతో కలిసి సీపీఎం నాయకులు బుధవారం రూరల్ మండల కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. రైతులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు ఎస్.రమణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 88 మంది రైతులకు ఒక్కొక్కరికి వ్యవసాయం చేసుకోవడానికి ఎకరం చొప్పున భూములిచ్చారని గుర్తు చేశారు. కొన్నాళ్ల తర్వాత ప్రభుత్వం వాటిని వెనక్కి తీసుకుందన్నారు. ఆ భూముల్లో నవోదయా స్కూల్, పోలీస్ ట్రైనింగ్ కేంద్రం, వికలాంగుల ఐటీఐ, పట్టుపురుగుల అభివృద్ధి కేంద్రం, జూనియర్ కాలేజీ నిర్మించారన్నారు. ఇంతవరకు ఆ రైతులకు ప్రత్యామ్నాయం చూపలేదని, వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కుమార్ డిమాండ్ చేశారు.

ముడసర్లోవ డంపింగ్ యార్డును తరలించాలి



ముడసర్లోవలో రిజర్వాయర్‌లో కలుస్తున్న మురుగు నీటిని పరిశీలిస్తున్న ఏఐవైఎఫ్ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక నిర్వహిస్తున్న డంపింగ్ యార్డును వెంటనే నివాసాలకు దూరంగా తరలించాలని ఏఐవైఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డుతోపాటు ముడసర్లోవ రిజర్వాయర్‌ను బుధవారం వారు సందర్శించారు. రామకృష్ణాపురం, విశాఖ కేంద్ర కారాగారం క్వార్టర్స్ నుంచి వచ్చిన వాడుక నీరు రిజర్వాయర్‌లో కలవడాన్ని పరిశీలించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి అచ్యుతరావు మాట్లాడుతూ ఆరిలోవ ప్రాంతానికి తాగు నీరు అందిస్తున్న ముడసర్లోవ రిజర్వాయర్ పైనున్న కాలనీల్లో ప్రజల వాడుక నీరు, వర్షా కాలంలో డంపింగ్ యార్డు వ్యర్థాల నుంచి వచ్చిన వరద నీటితో కలుషితమవుతోందన్నారు. ఈ నీరు తాగుతున్న ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. డంపింగ్ యార్డును దూరంగా తరలిస్తే రిజర్వాయర్‌లోని నీరు కలుషితం కాకుండా ఉంటుందని సూచించారు. జీవీఎంసీ అధికారులు దీనిపై చర్యలు చేపట్టాలని కోరారు. ఏఐవైఎఫ్ ప్రతినిధులు ఎస్.మధురెడ్డి, కొమర సందీప్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎఫ్-5లో చెత్త నిల్వ ఉంచొద్దు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: జోన్–5 పరిధి తాటిచెట్లపాలెం ఎంఎస్‌ఎఫ్‌లో చెత్త ఎప్పటికప్పుడు తరలించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జోన్ 3, 4, 5, 8 పరిధిలోని పాత జైల్‌రోడ్డు, జగదాంబ జంక్షన్, తాటిచెట్లపాలెం, పెందుర్తి, సుజాతనగర్, దత్ ఐలాండ్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఏ రోజు చెత్త అదే రోజు తరలించేందుకు మినీ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను సందర్శించారు. పాత జైల్‌రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహ కూడలి పరిసర ప్రాంతాలను అభివృద్ధి పరిచేందుకు గల అవకాశాలు, జైల్‌రోడ్డు నుంచి జగదాంబ జంక్షన్ వరకు రహదారి విస్తరణ, జంక్షన్ల అభివృద్ధికి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం 8వ జోన్ పరిధి సుజాతనగర్‌లో పర్యటించి గిరిప్రసాద్ నగర్‌లో నూతనంగా రహదారులు, జంక్షన్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సుజాతనగర్‌లో చెత్తను వెంటనే తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్‌కుమార్, సత్యనారాయణ రాజు, రామ్మోహనరావు, జోనల్ కమిషనర్లు ఆర్‌జీవీ కృష్ణ, మల్లయ్యనాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్ సంతోషి తదితరులు పాల్గొన్నారు.